క్లుప్తంగా

జింక మల్లన్న బోనాల జాతర



బోనాల ఊరేగింపులో భక్తులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో జింక మల్లన్న జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలో ఉదయం వేళ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం వేళ బోనాల ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమం



ఉచిత నమోదు కార్యక్రమం

ధర్మపురి: మండలంలోని జైనా గ్రామం ఆదివారం ఆయుష్మాన్ భారత్ ఉచిత కార్డు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ కుడిక్యాల మహేశ్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రతి వార్డులో ఉన్న వారికి ప్రతిరోజూ సభ్యులు వెళ్లి నమోదు కార్యక్రమాన్ని చేపడుతారని సర్పంచ్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌చందర్‌రావ్, గాజుల సత్తయ్య, గాండ్ల రమేశ్, విజయ్, అయ్యోరి సత్యం ఉన్నారు.

రాయికల్ పట్టణంలో..



దరఖాస్తులు స్వీకరిస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: పట్టణంలోని 8వ వార్డులో ఆదివారం బీజేపీ నియోజకవర్గ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ యోజన పథకంపై ఉచితంగా దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు సింగని సతీశ్ పాల్గొన్నారు.

విద్యార్హతలపై ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న విద్యార్థినులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట గ్రామాల్లో జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం ఇంటింటా తిరుగుతూ కుటుంబ విద్యార్హతలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పడాల తిరుపతి, గిద్దె చంద్రయ్య పాల్గొన్నారు.

యెఖీన్‌పూర్‌లో దంత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న మోహన్‌రెడ్డి

కోరుట్ల: పట్టణ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామంలో కోరుట్ల సేవాదళ్ ఆధ్వర్యంలో శ్రీసాయి దంత వైద్యశాల వైద్యులు ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, డాక్టర్ సిరికొండ శ్రీనివాస్, సేవాదళ్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య పాల్గొన్నారు.

నేడు ఇబ్రహీంపట్నంలో ఆత్మీయ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి ఆదివారం తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు హాజరవుతారని, మండలంలోని పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

- క్రీడా ప్రాంగణాలు పూర్తయి నెలలు గడుస్తున్న వైనం
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సర్పంచ్‌లు
- సర్వసభ్య సమావేశాల్లో నిరసన తెలిపినా.. స్పందించని అధికారులు



నర్సింహునిపేటలో నామమాత్రంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

పెగడపల్లి: క్రీడా ప్రాంగణాలు వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సర్పంచులు అప్పు చేసి పనులు పూర్తి చేశారు. కొందరు సర్పంచులు పనులు పూర్తిచేసి ఏడాది, మరి కొందరు సర్పంచులు పనులు పూర్తిచేసి ఆరునెలలు కావస్తోంది. చేసిన పనికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ప్రభుత్వ లక్ష్యం భాగానే ఉన్నప్పటికీ తమకు మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని సర్పంచులు వాపోతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

పెగడపల్లి మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు బిల్లు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రూ.40లక్షల వరకు బిల్లు రూపేణా సర్పంచులకు రావాల్సి ఉంది. బిల్లుల జాప్యంపై పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో నిరసనలు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని మండల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో పరిస్థితి ఇలా..

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో పనులు పూర్తయినా పూర్తి స్థాయిలో బిల్లులు అందలేదు. ఆయా జీపీల్లో చేపట్టిన క్రీడా ప్రాంగణాలు సగటున రూ.1.70 లక్షల వరకు ఖర్చు చేసినట్లు అధికారులు చెప్తున్నారు. తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకు నిర్ణయించారు. కొన్ని జీపీల్లో క్రీడా మైదానాలు పూరి చేసినట్లు బోర్డులు పెట్టినా మైదానాల్లో ఆటలు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా సామగ్రి ఏర్పాటు చేయలేదు. దీంతో పేరుకే క్రీడా మైదానాలు తప్ప.. ఆటలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని గ్రామాల్లోని యువకులు విమర్శిస్తున్నారు. క్రీడా మైదానాలు ఎకరం స్థలంలో ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా.. స్థలాల కొరతతో తక్కువ స్థలాలు, పాఠశాల ఆవరణల్లోనే వీటిని ఏర్పాటు చేశారు.

జిల్లా అధికారులకు నివేదించాం



క్రీడా మైదానాల బిల్లు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. మండలంలో పనులు పూర్తి చేసిన జీపీల బిల్లులను జిల్లా అధికారులకు రికార్డు చేసి నివేదించాం. బిల్లులు మంజూరైన వెంటనే జీపీ ఖాతాల్లో జమచేస్తాం. కొన్ని జీపీల్లో స్థలాల కొరత ఉన్న కారణంగా తక్కువ స్థలంలో వీటిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అన్ని మైదానాల్లో క్రీడాకారులు ఆటలు ఆడుకునేలా క్రీడా సామగ్రి ఏర్పాటు చేయిస్తున్నాం. – వేణు, ఎంపీవో

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నం



క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి ఆరునెలలు గడిచింది. అధికారులు ఒత్తిడి కారణంగా అప్పులు తెచ్చి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినం. నేటికీ బిల్లు అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. మాతో పనులు త్వరగా పూర్తి చేయించిన అధికారులు బిల్లులు చెల్లించే విషయంలో అదే చొరవ తీసుకోవాలి. – ఈరెల్లి శంకర్, సర్పంచ్, లింగాపూర్

అధికారులు జాప్యం చేస్తున్నారు



క్రీడా ప్రాంగణాలకు చెందిన బిల్లులు ఇవ్వాలని అధికారులను అడిగితే వస్తాయని సమాధానం చెప్తూ దాట వేస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అందుతాయని చెప్పినా.. బిల్లుల చెల్లింపులో అధికారులు జాప్యం చేస్తున్నారు. బిల్లుల విషయమై మండల సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. – జిట్టబోయిన కొండయ్య, సర్పంచ్, అయితిపల్లి

నిధులు పక్కదారి పట్టాయి!

- ఏళ్లు గడుస్తున్నా రికవరీ కాని రూ.14.50 లక్షలు
- న్యాయం చేయాలని 11 మహిళా సంఘాల వేడుకోలు



బీర్‌పూర్ మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన అధికారులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మహిళా సంఘాల్లోని స్త్రీనిధి ద్వారా మంజూరైన రూ.14.50లక్షలు గోల్‌మాల్ జరిగిందని, రికవరీ చేయాల్సిన అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని 11 మహిళా సంఘాల సభ్యులు అధికారులను కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్‌పూర్ గ్రామంలో మొత్తం 15 మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలకు 2017–18లో స్త్రీనిధి నుంచి రూ.14.50లక్షలు రుణం కింద జమయ్యాయి. కానీ ఈ డబ్బులను గ్రామంలోని 11 సంఘాల మహిళలు తమకు రుణం వద్దనడంతో వచ్చిన డబ్బులను తిరిగి గ్రామైక్య సంఘంలో జమ చేశారు. అయితే వీరి ఖాతాల నుంచి రుణం తీసుకున్నట్లు తొలగించకపోవడంతో రూ.14.50లక్షలు స్త్రీనిధి నుంచి తీసుకున్నట్లు రికార్డుల్లో నమోదవుతూ వస్తోంది. దీనిపై ఆయా సంఘాల మహిళలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ డబ్బులను ఎత్తుకొని చెల్లించని వారికి సీసీలు, వీవోలు అనధికారికంగా సర్దుబాటు చేయడంతో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు సదరు సంఘాల మహిళలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు గతంలో దీనిపై విచారించి అప్పటి సీసీని సస్పెన్షన్ చేశారు. రికవరి చేస్తామని అధికారులు చెప్పారు గానీ రికవరీ మాత్రం జరగలేదని 11 సంఘాల మహిళలు పేర్కొంటున్నారు. దీంతో పాటు మరో రూ.9లక్షల లెక్కలు కూడా లేవని, రికార్డులు కూడా సరిగా లేవని మహిళలు ఆరోపిస్తున్నారు. దీనిపై స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రమాదేవి వివరణ ఇస్తూ 2016 నుంచి సంఘాల్లో అవినీతి చోటు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారులు ఒకరిని సస్పెన్షన్ చేశారన్నారు. ప్రస్తుతం రకవరీ కోసం 20 రోజుల క్రితం అవినీతి చేసిన వారికి నోటీసులు ఇచ్చామని, ఏప్రిల్‌లో దీనిపై పూర్తిస్థాయి చర్యలు ఉంటాయన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని వాణినగర్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మంచాల క్రిష్ణ, జీఆర్‌దేశాయ్, పెద్ది ఆనందం, మహంకాళి రాజన్న, మహేశ్ పాల్గొన్నారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం



ఇఫ్తార్ విందులో డాక్టర్ సంజయ్

కోరుట్ల: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని మతాలకు సీఎం కేసీఆర్ సమ ప్రాధాన్యం ఇస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నియామకం

కథలాపూర్: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా సిరికొండ గ్రామానికి చెందిన మల్యాల మారుతి నియమితులయ్యారు. రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీలను చైతన్యపరుస్తూ, సామాజిక కార్యక్రమాల్లో మారుతి పాలు పంచుకోవడంతో మండలాధ్యక్షుడిగా నియమించామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సీపీఆర్‌పై శిక్షణ

జగిత్యాలటౌన్: ప్రాణ రక్షణ ప్రక్రియ(సీపీఆర్)పై ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం(ఐడీవోసీ)లో శిక్షణ ఇచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గుండెపోటుకు గురైన వారికి సత్వరంగా ప్రాథమిక చికిత్స అందించేందుకు ప్రభుత్వం సీపీఆర్ శిక్షణ ప్రారంభించిందని తెలిపారు. సీపీఆర్‌పై హెల్త్‌కేర్ వర్కర్స్, మున్సిపల్, పోలీస్, వలంటీర్స్, షాపింగ్‌మాల్స్ సిబ్బంది తదితరులకు శిక్షణ ఇస్తామని వివరించారు. జిల్లా వైద్యాధికారి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

✦గుడిసె దగ్ధం

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని కల్లు మండువ వద్ద ఏర్పాటు చేసిన గుడిసెకు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన తిరుపతిగౌడ్ కల్లు మండువ వద్ద కల్లు విక్రయించేందుకు గుడిసెను ఏర్పాటు చేశాడు. కాగా శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఇతర ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా మంటలు ఆర్పివేశారు. బాధితుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

✦చికిత్స పొందుతూ యువతి మృతి

ధర్మపురి: కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ సలీం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జైనా గ్రామానికి చెందిన ముడిమడుగు శంకర్ దుర్గమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు జ్యోతి (26) అవివాహిత. కొంత కాలం నుంచి కడుపునొప్పితో బాధ పడుతోంది. 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో వైఈవీఓ గోలీలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

✦నేడు మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

మెట్‌పల్లి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మైనార్టీ రుణాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ రుణాల కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల నుంచి డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

✦కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సౌజన్య

కథలాపూర్: మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రకటించారు. చైర్‌పర్సన్‌గా దూలూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గుండారపు సౌజన్య, వైస్ చైర్మన్‌గా చింతకుంట గ్రామానికి చెందిన సోమ దేవేందర్‌రెడ్డిని నియమించారు. డైరెక్టర్లుగా సబ్బని గంగు, కొత్తపెల్లి శ్రీనివాస్, వన్నెల రాజాగౌడ్, రాచమడుగు గంగారావు, వేణుగోపాల్, రూపిక, రమేశ్, నరేశ్, రమేశ్, ఆదిరెడ్డి, రాజారెడ్డి, గంగాధర్, నీరజను నియమించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



ఇటిక్యాలలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఇటిక్యాల రామరావుపల్లె గ్రామాల్లో 'మీరు–నేను' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్వయంగా వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టారు. రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటిక్యాలలో అభివృద్ధి పనులకు రూ.2.04కోట్లతో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ సామల్ల లావణ్య, తిరుమల్, ఇటిక్యాల నాయకులు స్వామిరెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, రుక్కు, రఘునాథ్, సీరటి శ్రీనివాస్, నారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామంలో కౌలు రైతు సంగెం భూమయ్య సాగు చేసిన మొక్కజొన్న పంట దెబ్బతినగా ఆయనను పరామర్శించి రూ.10వేలు అందించారు. జెడ్పీటీసీ మహేశ్, రైతుబంధు కన్వీనర్ శంకర్, నాయకులు గంగాధర్, చంద్రమౌళి, ముత్తయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

జగిత్యాలటౌన్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని, కల్యాణలక్ష్మి పథకంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జగిత్యాల అర్బన్ మండలానికి చెందిన ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు నియోజకవర్గంలోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మహేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శీలం సురేందర్‌తో పాటు సర్పంచులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది

జగిత్యాలఅగ్రికల్చర్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు.

ఆడబిడ్డలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్‌లో జగిత్యాలఅర్బన్ మండలానికి చెందిన ఆడబిడ్డలకు ఆదివారం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మహేశ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ శీలం సురేందర్, సర్పంచ్‌లు గంగాధర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

భగీరథ నీరు రావడం లేదు

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, వైకుంఠధామం నిర్మించాలని, నిరుపేదలకు డబుల్‌బెడ్రూం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలని ఆదివారం పల్లెనిద్రలో పాల్గొన్న ఎమ్మెల్యేకు బీజేపీ నాయకులు జలందర్‌రెడ్డి, రొట్ట శ్రీధర్ వినతిపత్రం ఇచ్చారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కథలాపూర్: ఈదురుగాలుల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం కథలాపూర్ మండలం కలిగోట గ్రామ శివారులో అకాల వర్షానికి దెబ్బతిన్న వరి, నువ్వుల పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంతో పంట నష్టపోయి రైతులకు ఎకరానికి ప్రభుత్వం రూ.10వేలు పరిహారం ఇస్తుందన్నారు. పంటల నష్టాన్ని అధికారులు అంచనా వేయాలని ఆదేశించారు. రైతులు దిగులు చెందొద్దని, బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ చైర్మన్ గుండారపు సౌజన్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం శ్రీశివ భక్తమార్కండేయ స్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్, ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ నాయకులు డాక్టర్ జేఎన్ వెంకట్, నిషాంత్ కార్తికేయ పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు శివపార్వతుల కల్యాణం ఘనంగ నిర్వహించారు. సర్పంచ్ కడకుంట సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు సిరిపురం రవీందర్, చిట్టాపూర్ అధ్యక్షుడు భూస భూమయ్య, గౌరవ అధ్యక్షుడు చెన్న నర్సయ్య, కార్యదర్శి నవీన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆడెపు రాజేశ్, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి, శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీని సన్మానించారు.

బాలికల ఆరోగ్య పరిరక్షణకే ఔషధ కిట్లు



కిట్లు అందజేస్తున్న డాక్టర్ కృష్ణవేణి

మల్లాపూర్: బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వం ఆయుష్ ఔషధ కిట్లు పంపిణీ చేస్తోందని ఆయుర్వేద వైద్యురాలు (ఆయుష్ మెడికల్ అధికారి) డాక్టర్ కృష్ణవేణి అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బాలికలకు ఆయుష్ ఔషధ కిట్లను ఆమె పంపిణీ చేశారు. జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 9, 10వ తరగతుల విద్యార్థులకు ఆయుష్ ఔషధ కిట్లు అందిజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల ఫార్మసిస్ట్ జలందర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌కుమార్

మల్లాపూర్: టీడీపీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని టీడీపీ ప్రోగ్రాం కన్వీనర్ మానుక ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని గొర్రెపల్లి, రేగుంట గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 29న హైదరాబాద్‌లో నిర్వహించే టీడీపీ ఆవిర్భావ సభకు తరలిరావాని కోరారు. సీనియర్ నాయకులు నిమ్మల రాములుతో పాటు మేడిపట్ల అశోక్, సకినపెల్లి సాయిలు, నూనె రమణయ్య, కాకర్ల మాధవ్‌రెడ్డి, బాలె మారుతి, కటుకం మహదేవ్, రఫీ, ఉద్దీన్, గజల్ రాజు, గణేశ్, నజీర్, సత్యనారాయణ, రాజిరెడ్డి, గఫూర్, దండవేని బర్రన్న, రమేశ్ పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రదానం



బెల్టులు అందుకున్న విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని కుంగ్‌ఫూ డో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 60 మంది విద్యార్థులకు ఆదివారం మార్కండేయ మందిరంలో బెల్టులను ప్రదానం చేశారు. గ్రాండ్ మాస్టర్ కంఠేశ్వర్, కౌన్సిలర్లు మారంపెల్లి సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, విజడమ్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజరెడ్డి, అసిస్టెంట్ గ్రాండ్‌మాస్టర్ హరికృష్ణ, శ్రీనివాస్, మాస్టర్లు కుమార్, చందు, ప్రభాకర్, ప్రవీణ్, గ్రామ నాయకులు గోపి, గంగరాజం పాల్గొన్నారు.